
ప్రజాశక్తి
మంగళవారం 3 జనవరి 2023 5 అనంతపురం





స్పందనలో అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాల వార్తలు వింటూనే ఉంటున్నాం. ఈ ప్రమాదాలకు వాహనదారుల అతివేగం ఒక కారణమైతే, కొన్ని చోట్ల రోడ్డు నిర్మాణాలు, మలుపులు కారణమవుతున్నాయి. అత్యధికంగా జరిగే ప్రాంతాలు, నిర్మాణాల్లో ఉన్న లోపాలను 'బ్లాక్ స్పాట్స్'గా చెబుతుంటారు. ఈ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినప్పటికీ రహదారి నిర్మాణాల్లో మార్పులు చేపడుతున్న దాఖలాలు నామమాత్రంగానే అని చెప్పాలి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాల్లో ఈ బ్లాక్ స్పాట్స్‌పై చర్చించడం జరుగుతుంది. అయితే దాని తరువాత మార్పులు మాత్రం కొన్ని సంవత్సరాలైనా చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





◆ రోడ్లపై వరుస ప్రమాదాలు
◆ రోజుకు సగటున ఒక ప్రమాదం
◆ ప్రాణాలు పోతున్నా చేపట్టని చర్యలు
◆ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపుతోనే సరి

తొలగని బ్లాక్‌స్పాట్స్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ప్రతి రోజూ ఏదోక చోట ప్రమాద ఘటన చోటు చేసుకుంటూనే ఉంది. సగటున రోజుకు ఒకటి నుంచి రెండు ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నట్టు అధికారుల రికార్డులే చెబుతున్నాయి. 2022 సంవత్సరంలో జనవరి నుంచి డిసెంబరు వరకు జరిగిన ప్రమాద ఘటనలు జిల్లాలో 533 ఉన్నాయి. అంటే సగటున రోజుకు 1.4 ఘటనలు జరుగుతున్నాయి. అంటే ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో మొత్తం చనిపోయిన వారు 321 మంది అంటే ఇంచుమించు రోజుకు ఒకరు చొప్పునే చనిపోతున్నారు. 576 మంది గాయపడ్డారు. అంటే ఇద్దరు చొప్పున ప్రమాదం బారినపడుతున్నారు. ఇలా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుని తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా వాటి నివారణకు తీసుకోవాల్సినన్ని చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

15 ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్

జిల్లాలో ప్రధానంగా 15 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఇందులో నాలుగు అత్యంత ప్రమాదకరంగానున్నవి అనంతపురం నగరం చుట్టూనే ఉన్నాయి. చెన్నై హైవే నుంచి బెంగళూరుకు హైవేకు కలిపితే కొత్తగా నిర్మించిన రహదారి రాప్తాడు వద్ద కలుస్తుంది. ఇక్కడ హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వైపునకు వెళ్లే వాహనాలు వేగంగా వెలుతుంటాయి. అదే ప్రాంతంలో అడ్డంగా చెన్నై వైపు నుంచి ఎన్‌హెచ్44 పైకి ఎక్కనున్నాయి. ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉందని గుర్తించారు. అయితే రహదారి నిర్మాణంలో ఎటువంటి మార్పుల్లేకుండానే కొనసాగిస్తున్నారు. ఇక రెండో ప్రాంతం తపోవనం వద్దనున్న ఎన్‌హెచ్44 ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం లేకపోవడం, నేరుగా జాతీయ రహదారిపైకి నగరంలోకి వెళ్లే వాహనాలు అటు, ఇటు వెలుతుంటాయి. ఇక్కడ కూడా అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. సాయంత్రం సమయాల్లో రద్దీ కూడా అధికంగా ఉంటోంది. ఇక్కడ అండర్‌పాస్‌గానీ, ఓవర్ బ్రిడ్జిగాని నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీని తరువాత పంగల్ రోడ్డు, ఇది కూడా ప్రమాదకరంగానే ఉంది. ఇక్కడ మార్పులు చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు ఇతర ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. వీటిని నాలుగైదు రోడ్డు సేఫ్టీ సమావేశాల్లోనూ చర్చించినప్పటికీ చర్యలు మాత్రం నామ మాత్రంగానే ఉంటున్నాయి. ప్రజల ప్రాణాలు మాత్రం గాల్లో కలసిపోతూనే ఉన్నాయి.



రాప్తాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్‌ఫొటో)

చర్యలు తీసుకుంటున్నారు

జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాం. కొన్ని చోట్ల మార్పులకు ఇంజినీరింగు విభాగం వారు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.1.50కోట్ల వరకు నిధులు విడుదలై ఉన్నాయి. మరికొన్ని చోట్ల మార్పులు జరగాల్సి ఉంది. వాటిపైనా జనవరి 4వ తేదీన జరిగే సమావేశంలోనూ చర్చించి తగిన చర్యలు చేపడతాం.

శివరాం ప్రసాద్ , డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్.

ఇకపై ముఖ్యమంత్రికి

స్పందన అర్జీలు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందన కార్యక్రమం ద్వారా సమర్పించే అర్జీలు ఇక నుంచీ నేరుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యవేక్షించనున్నారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లతో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా అధికారులు సక్రమంగా సమాధానాలు ఇవ్వని అర్జీలను ముఖ్యమంత్రి కార్యాలయం పరిశీలనలో ఉంటాయన్నారు. ప్రతి అర్జీకి ఉద్యోగులు నాణ్యమైన పరిష్కారాలు అందించాలన్నారు. జిల్లా స్థాయిలో సరైన పరిష్కారాలు చూపకపోతే సమాధానం ముఖ్యమంత్రికి చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. స్పందనలో అర్జీ ఇవ్వడం అంటే ముఖ్యమంత్రికి నేరుగా సమస్య విన్నవించుకున్నట్టే అని అధికారులు భావించాలని తెలిపారు. సోమవారం నాటి స్పందనలో వివిధ ప్రాంతాల నుంచి 410 అర్జీలను ప్రజలు అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రి దేవి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఆర్డీవో మధుసూదన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు నమోదును చేపట్టండి

జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేసేందుకు సాంకేతిక ఇబ్బందులు లేకుండా చూడాలని ఎన్‌ఐసి అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ముఖ ఆధారిత హాజరును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ ఉద్యోగులంతా పాటించేలా చూడాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు నిర్వహించే పింఛన్ పెంపు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా క్షేత్ర స్థాయిలో గ్రామ,వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. గర్భిణులు తప్పనిసరిగా అంగన్ వాడీలలో భోజనం చేసేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

అభ్యర్థులను మార్చే సంస్కృతి టిడిపిదే

ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం



అసెంబ్లీ ఎన్నికల్లో తరచూ అభ్యర్థులను మార్చే సంప్రదాయం తెలుగుదేశం పార్టీదేనని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం స్థానానికి తానే అభ్యర్థినని, రామచంద్రారెడ్డికి టికెట్ వస్తుందో లేదో అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. 2009, 2012, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తానే కాంగ్రెస్, వైసిపి అభ్యర్థిగా రాయదుర్గం స్థానానికి పోటీ చేశానన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు కూడా రాయదుర్గం స్థానానికి తానే పోటీలో ఉంటానన్నారు. అయితే తెలుగుదేశం పార్టీకి గతంలో జరిగిన నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిసారీ వేర్వేరు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. అలా అభ్యర్థులను మార్చే సాంప్రదాయం తెలుగుదేశం పార్టీలోనే ఉందన్నారు. కుప్పంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టిడిపి ఘోరంగా ఓటమి పాలైందన్నారు. మంగళగిరిలో లోకేష్, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులుకు పరాజయం తప్పలేదన్నారు. సీఎం జగన్ చెప్పినట్లు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలను వైసిపి గెలుచుకుంటుందని అన్నారు. ప్రజల్లో వైసిపికి, జగన్ కు, తనకు ప్రజల హృదయాల్లో స్థానం ఉందన్నారు. కాలవ శ్రీనివాసులు పప్పులు ఉడకవన్నారు. ఆయనకు రాయదుర్గంలో నూకలు చెల్లాయన్నారు. ఇది వైకాపా అడ్డా అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులుకు టిడిపి టికెట్ వస్తుందో రాదో అని సందేహం వ్యక్తం చేశారు. ఒకవేళ వచ్చినా ఘోర పరాజయం తప్పదన్నారు.

వైసిపి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-గుత్తి

వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేందర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు రైతులకు పెద్దపీట వేశారన్నారు. వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. పాఠశాలలు విలీనం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సీఎం జగన్‌పై ఆగ్రహంతో ఉన్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్, మండల పట్టణ, కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్ గౌడ్, టౌన్ బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ జిలాన్, కృష్ణ, ఎంపిటీసీ జింకల నారాయణస్వామి మాజీ ఎంపీపీ వీరేష్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు భాస్కర్ స్వామి, వంకాయల శీనా, అగ్గి రాముడు, హనుమంతరెడ్డి, భోగాంజనేయులు, రమేష్, రామమూర్తి, గద్దల మస్తాన్, మాజీ కౌన్సిలర్ కె.గోవిందు, మాజీ సర్పంచులు తిరుపాలు, వెంకటరాముడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



లచ్చానుపల్లిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో జితేంద్రగౌడ్

నేడు లైఫ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి-అనంతపుర కలెక్టరేట్

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోషియేషన్, అనంతపురం జిల్లా బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోం ప్రాంగణంలోని పెన్షనర్స్ భవన్ నందు మంగళవారం లైఫ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, నమోదు చేస్తున్నట్లు పెన్షనర్స సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, శీలా జయరామప్ప, కోశాధికారి జి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ నందు, బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేస్తామన్నారు. అక్‌నాలెడ్జిమెంట్ ఇస్తామని చెప్పారు. ఈ సదుపాయం ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా పెన్షనర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాన్యువల్ వెరిఫికేషన్ ధ్రువపత్రాలను ఎస్‌టిఒ కార్యాలయంలో గాని, ఆన్‌లైన్ సర్వీసు ఉన్న చోట గాని జీవన్ ప్రమాణ్ పోర్టల్ నందు బయోమెట్రిక్, ఐరిష్, ఫేస్ యాప్‌ల ద్వారా ఇవ్వవలసిఉంటుందన్నారు. యాన్యువల్ వెరిఫికేషన్ ధ్రువపత్రం ఇవ్వడానికి వచ్చే వారు... వారివెంట పిపిఒ కాపీ, ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, ఆధార్ లింక్డ్ సెల్ పోన్, సిఎఫ్ఎంఎస్ నెంబరు పాస్‌వర్డ్ తప్పక తీసుకురావాలని తెలియజేశారు.

జెఎన్‌టియు అభివృద్ధికి ఉద్యోగులు తోడ్పాటునందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విసి రంగజనార్ధన, జెఎన్‌టియు సిబ్బంది

క్యాలెండర్ ఆవిష్కరణలో ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు అభివృద్ధికి ఉద్యోగులు తోడ్పాటునందించాలని ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. సోమవారం వర్సిటీ పరిపాలనా భవనంలో ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, డైరెక్టర్లతో కలిసి జెఎన్‌టియు 2023 సంవత్సరం క్యాలెండర్‌ను, ప్లానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి.రంగజనార్ధన మాట్లాడుతూ.. మొదటగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి తోడ్పాటు అవసరమని తెలిపారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగులో మంచి మెరుగైన ర్యాంకింగ్‌కు కృషి చేయాలని తెలిపారు. మంచి రీసెర్చ్ ప్రాజెక్టులు వచ్చే విధంగా ప్రతి ప్యాకల్టీ కృషిచేయాలన్నారు. వర్సిటీ అభివృద్ధికి బోధనేతర, అవుట్ సోర్సింగ్ సిబ్బంది తోడ్పాటునందించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. రెక్టార్ ఆచార్య విజయ కుమార్ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య వి. సుమలత యూనివర్సిటీ డైరెక్టర్లు, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్, పులివెందుల కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ఎస్.రాజు, అనంతపురం కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భవాని, డాక్టర్ కళ్యాణ్ కుమార్, బోధన, బోధనేతర, అవుట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మలదిన్నెలో గడపగడపకూ మన ప్రభుత్వం

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు పొంగలిదిన్నె రామయ్య, అమ్మలదిన్నె సర్పంచి గౌతమి రామచంద్రారెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు, గుంటూరు ఘటనలకు బాబుదే బాధ్యత

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి కారణంగానే మొన్న కందుకూరులో 8 మంది, నిన్న గుంటూరులో ముగ్గురు తొక్కిసలాట జరిగి చనిపోయారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ ఘటనలు దురదృష్టకరమని అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద రాజీవ్ కాలనీ, 48వ డివిజన్ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు స్వార్థ, పబ్లిసిటీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోసం తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. పింఛన్లు తొలగిస్తున్నామంటూ ప్రతిపక్షాలు, ఓ వర్గం మీడియా గగ్గోలు పెట్టిందని.. కానీ తాము ఎక్కడా పింఛన్లు తొలగించలేదని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో కంటే ఇప్పుడు రెట్టింపు పింఛన్లు అందిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వనన్ని పింఛన్లు ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం నియోజకవర్గంలో వెయ్యికి పైగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.

ఎన్‌ఎస్‌హెచ్‌ఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిలాన్

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిలాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆ సంఘం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆ సంఘం తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి, సలహాదారుడు లాయర్ ఓబులపతి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చోటా హక్కుల ఉల్లంఘనలు సర్వ సాధారణమైపోయాయన్నారు. ఈ తరుణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఎన్‌ఎస్‌హెచ్‌ఆర్ తరపున మనం గట్టిగా హక్కుల ఉల్లంఘనలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఎక్కడా హక్కుల ఉల్లంఘనలకు తావులేకుండా చూడాలని కోరారు. వీటి కోసం ఎంత దూరమైనా వెళ్లాలని వారు పిలుపునిచ్చారు. అంతే కాకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ జిలాన్‌ను వారు అభినందించారు. హక్కుల ఉల్లంఘనలపై పోరాడాలని వీటిపై అవగాహన సదస్సులు ప్రతి ఒక్క పాఠశాల, విద్యాలయాల్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సభ్యులు పవన్, హరి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

నార్పల : చామలూరు పొలం సర్వే నెం.215-2 నందు 4.62 సెంట్లు, 215-4 నందు 1.30 సెంట్లు ప్రభుత్వ భూమిలో ఆయా పరిసర గ్రామాలకు చెందిన నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద గంగయ్య, నారాయణ, రాజు, లక్ష్మీనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో భూమిపూజ చేస్తున్న దృశ్యం

భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో లక్ష్మీనరసింహ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ హేమాలత హాజరై భూమిపూజ చేశారు. రూ.15 లక్షలతో నిర్మించనున్న ఈ భవనానికి రైతు సంఘాలకు 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహారావు తెలిపారు. రైతులు పంటలు నిలువచేసుకునేందుకు, మార్కెట్ చేసుకునేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, ఆత్మకూరు సర్పంచి వరలక్ష్మి, యాల్లేరు సర్పంచి ఆరోగ్య రెడ్డి, ఎంపీడీవో కొండన్న, ఉద్యాన అధికారి రత్నకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సుజిత, విజయకుమార్, పెద్దలు అతికిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : వెస్ట్‌నరసాపురం గ్రామంలో ఉద్యాన శాఖ ద్వారా మంజూరైన కలెక్షన్స్ సెంటర్ భవన నిర్మాణానికి సింగిల్ విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామ్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, విఎఎ అనూష, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల కేంద్రంలోని ఉద్యాన అధికారి కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని కంపచెట్లు, పిచ్చిమొక్కలను అధికారులు సోమవారం తొలగించారు. రెండు రోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో 'కంపచెట్లతో కనబడని ఉద్యాన అధికారి కార్యాలయం' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విధితమే. దీనికి స్పందించిన అధికారులు కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందమే సిఎం ఆశయం

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పద్మావతి, మేయర్ వసీం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నగర మేయర్ మేయర్ మొహమ్మద్ వసీం కొనియాడారు. సోమవారం నగరంలోని 44వ డివిజన్ పరిధిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట మేరకు సిఎం జగనన్న పింఛను రూ.2750 లకు పెంచారన్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని, ఆ ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే



ఉరవకొండలో..

దక్కుతుందన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, మధు, ఖాజా, నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్రంలోనే అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాలు వెలుగు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం విడపనకల్ మండల పరిధిలోని పోలికి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, సర్పంచి బోయ నాగమ్మ, వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీమిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శ్రీరాములు, సర్పంచులు రామాంజనేయులురెడ్డి, ఉమా శంకర్, దేవరాజ్, విద్యా కమిటీ చైర్మన్ గిరిబాబు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మేయర్ వసీం

శింగనమల : పింఛను కోసం ఎవరి దగ్గరికీ వెళ్లి చేతులు కట్టుకోవాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం సింగనమల ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్, బొమ్మన శ్రీరామ్‌రెడ్డి, నాయకులు ఆలూరు ఎర్రి స్వామిరెడ్డి, జడ్పిటిసి కంచిరెడ్డి సుధా రెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, ఎంపీడీవో నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ సిడిపిఒ ఉమాశంకరమ్మ, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : నూతనంగా మంజూరైన 17 పింఛన్లను స్థానిక సచివాలయంలో లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. సర్పంచి ఓబులేసు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఒకటో వార్డు మెంబర్ రాధా, పంచాయతీ కార్యదర్శి సరోజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. .

నేరాలు ఘోరాలు

పట్టపగలే ఇంట్లో చోరీ

రూ.6 లక్షలు విలువజేసే బంగారు నగలు, నగదు అపహరణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలం దేవగిరి గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. దేవగిరి గ్రామానికి చెందిన కూలూరు వసంతకుమార్ సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తోటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దుండగులు ఇంట్లోని బీరువా పగులగొట్టి రూ.6 లక్షలు విలువజేసే బంగారు నక్లెస్, ఒక చైను, కమ్మలు, జుంకీలు, రూ.25 వేలు నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాక్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ సమీపంలో సోమవారం పి.లక్ష్మమ్మ(86) సోమవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రహీం తెలిపిన వివరాల మేరకు అల్లుగుండు గ్రామానికి చెందిన అక్కులప్ప భార్య పి.లక్ష్మమ్మ ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. ఈనేపత్యంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని నిరసన



నిరసన తెలపుతున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-పుట్లూరు

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యునియన్ పుట్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సర్కిల్ నందు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పుట్లూరు మండలంలో అనేకమంది భవన నిర్మాణ పనుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్మికుల కడుపుకొట్టే విధంగా ఉన్నాయన్నారు. భవన నిర్మాణానికి ఉపయోగించే, ఐరన్, సిమెంట్, పెయింట్స్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. అందరికీ ఇసుకను అందుబాటులోకి తేవాలని, ప్రతి భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి కార్మికునికి కార్మిక భృతి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు వలెపు హరి, కార్యదర్శి వి.వెంకటశేఖర్, నాయకులు సురేష్, గోవింద్, రాఘవ ఆచారి, కార్మికులు పెద్దిరాజు, కుళ్లాయప్ప, సుబహాన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఉచితంగా సరుకులు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

సంక్రాంతి పండుగకు ప్రజలకు సరుకులు ఉచితంగా ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు రాముకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా వ్యాధి నుండి ప్రజలు ఇంకా కోలుకోలేదన్నారు. నిత్యం కరువులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిరువ్యాపారాలకు వ్యాపారాలు లేక, వ్యవసాయ కూలీలకు కూలి పనులు దొరక్క, ఇసుక కొరతతో నిర్మాణంగ కార్మికులు, అనుబంధ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పండుగకు సరుకులు కొనుగోలు చేసే స్తోమత పేద ప్రజలకు లేదన్నారు. ప్రభుత్వం చవక దుకాణాల ద్వారా పండుగకు అవసరమయ్యే గోధుమపిండి, బ్యాళ్లు, బెల్లం, నూనె తదితర సరుకులను ఉచితంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ మారుతి ప్రసాద్, నాయకులు జగ్గలి రమేష్, రాముడు నాయక్, బి.తిమ్మప్ప, వై.వీరన్న, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గ్రామసభలు

ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు సచివాలయ సిబ్బంది సహకరించాలని ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న తెలిపారు. సోమవారం బెలుగుప్ప మండల కేంద్రంలోని రెండవ సచివాలయం నందు గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ పెద్దన్న హాజరై మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఆరు నెలలుకోసారి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. గ్రామసభ నిర్వహించకుండా నిర్లక్ష్యం చేయడంపై సచివాలయం సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సక్రమంగా గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీపీ పెద్దన్న దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఆయన పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ శివలింగప్ప, కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచి రామేశ్వరరెడ్డి, కరుణాకర్ ఎపిఒ కృష్ణమూర్తి, పంచాయతీ సెక్రెటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఈవోఆర్డీ రఘురాంరావు తెలిపారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీల్లో జరిగిన ప్రగతిపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల అమలు, చేసిన పనులు, వివిధ కార్యక్రమాలపై చర్చించారు. 74 ఉడేగోళం చెరువులో చేపలు పెంచేందుకు వేలంపాట నిర్వహించారు. అత్యధికంగా రూ.1.15 లక్షలు వేలం పాడినట్లు ఇఒఆర్‌డి తెలిపారు. ఈ గ్రామసభల్లో పంచాయతీ కార్యదర్శులు వేణు, కొల్లప్ప, అశోక్, భీమేష్, హేమంత్‌రాజు, బసవరాజు, యల్లక్క, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బెలుగుప్పలో గ్రామసభ

ఎపిటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

ఎపిటిఎఫ్ 2023 క్యాలెండర్‌ను, డైరీని అపోలో డెంటల్ హాస్పిటల్ ఎమ్‌డి. జి.సుబ్బారెడ్డి స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చామాల అనిల్ వెంకటప్రసాద్‌రెడ్డి, అపోలో డెంటల్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టరు సుబ్బారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ కులశేఖర్‌రెడ్డి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, విశ్వనాథ రెడ్డి, వెంకటరెడ్డి, సత్యప్రసాద్, రంగప్రసాద్, ఫెడరేషన్ ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నార్పల : స్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఎంఇఒ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎపిటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగారెడ్డి, హనుమంతు, జిల్లా కౌన్సిలర్ శివారెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు, సీనియర్ నాయకులు జనార్ధన్, నాగరాజు, రామచంద్రారెడ్డి, బషీర్ పిఎస్ఎంఎస్ లక్ష్మీనారాయణ, గణేష్, హరినారాయణ, మునిస్వామి నాయక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. వెంకటేశ్వర స్వామి ప్రత్యేక దర్శనం చేసుకున్న అనంతరం తిరుచానూరు వెళ్లి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ఎమ్మెల్యే దంపతులు శ్రీకాళహస్తికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్యంపై గర్భిణులు శ్రద్ధ వహించాలి

డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఆరోగ్యంపై గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ కార్తీక్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నందు ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీపీ పెద్దన్న హాజరయ్యారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో నెలకోసారి ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి, ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, సర్పంచి సాలిబాయి, మాజీ సర్పంచి రామేశ్వరరెడ్డి, గంగ్యానాయక్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, వసంత, సరోజ, ఎఎన్ఎంలు రాధమ్మ, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ చేసి న్యాయం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కిరికెర పొలం సర్వే నెంబరు 254-1లో 20ఏళ్ల క్రితం అప్పటి తహశీల్దార్ నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించారని, అయితే కొంతమంది రెవెన్యూ సిబ్బంది దొంగ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారని, వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని సూరి, శ్రీనివాసరెడ్డి, శివ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక స్పందన కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ మండలం వడ్డిపల్లి గ్రామంలో డ్వాక్ర గ్రూపు లేఅవుట్‌లో హెచ్ఎస్‌డిఆర్ నెంబర్ 118/1409 కొంతమందికి ఇంటి పట్టాలను మంజూరు చేశారన్నారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల వద్ద ఒరిజినల్ పట్టాలు ఉన్నాయన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులతో కలిసి దొంగపట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ విచారించి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉచితంగా బోర్లు వేయించాలని వినతి

పుట్లూరు : జలకళ పథకం ద్వారా అర్హులైన రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించాలని బిజెపి పుట్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో తహశీల్దారుకు సోమవార వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంద శ్రీనివాసుల రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాగేని రామాంజి యాదవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రామ్మోహన్, ఉపాధ్యక్షులు ములి సూర్యనారాయణరెడ్డి కార్యదర్శులు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అనంత

కన్నుల పండువగా వైకుంఠ ఏకాదశి

ప్రజాశక్తి-తాడిపత్రి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తాడిపత్రి పట్టణంలోని పురాతన శ్రీ చింతల వెంకటరమణ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. 45,000 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. తిరుమల నుండి తెప్పించిన లడ్డు ప్రసాదం, అన్నవరం నుంచి తెప్పించిన సత్యదేవుని ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మురళిస్వామి, ఈవో సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నార్పల : నార్పల మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనంతపురం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడం ముక్తికి మార్గమని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం పాతూరులోని చెన్నకేశ్వరస్వామి, శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే అనంత స్వామివారి దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణి పాండురంగస్వామి ఆలయాల్లో వైకుంట ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎపిఐఐసి చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, ఖశీం, మాజీ ఎంపీపీ లాలుసాబ్, సిద్ధంపూర్ సర్పంచి ఆంజనేయులు, కురవల్లి ఎంపిటిసి వెంకటేశులు రుక్మిణి పాండురంగ స్వామి వారిని దర్శించుకున్నారు.

రాయదుర్గం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, కోడలు అలేఖ్యారెడ్డి, యువ నాయకుడు కాపు ప్రవీణ్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు.

శింగనమల : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శింగనమల మండల కేంద్రంలోని అతి పురాతన చెన్నకేశవస్వామి దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

బెలుగుప్ప : మండలంలోని పలు గ్రామాలలో ముక్కోటి ఏకాదశిని వైభవంగా నిర్వహించారు మండల కేంద్రంలోని మంజునాథస్వామి దేవాలయం, శ్రీరంగాపురం గ్రామంలో రఘునాథ స్వామి ఆలయం, బూదుగుమ్మలో పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రజాశక్తి క్యాలెండరను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులు

ప్రజాశక్తి 2023 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రజాశక్తి 2023 తాడిపత్రి నియోజకవర్గం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేకు ప్రజాశక్తి విలేకరులు వెంకటరామిరెడ్డి, ఆదినారాయణ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ నిజాలు నిర్భయంగా ప్రజలకు అందిస్తున్న ప్రజాశక్తి దినపత్రిక ప్రజల మన్ననలను పొందుతోందని తెలిపారు. మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలు, పాఠకులు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి, వంగనూరు సూరి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండలశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్, డైరీలను ఎంఇఒ గురుప్రసాద్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందుంటుందన్నారు. గత సంవత్సరం జీవోలను అధ్యాపక దర్శిని ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ డైరీలో ఉపాధ్యాయులకు సంబందించిన అనేక సందేహాల నివృత్తి, పిఆర్‌సి జిఒలు, టైమ్‌స్కేలు, ముఖ్యమైన వారి ఫోన్ నెంబర్లు ఉన్నాయని, ఇది అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, హెన్రీమార్క్, మహమ్మద్ గౌస్, సాధిక్, సీతారామరెడ్డి, జగదీష్, మస్తాన్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న హౌసింగ్‌బోర్డు చైతన్య సిబ్బంది

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి, అనంతపురం 8వ బ్రాంచ్ ప్రిన్సిపాల్ నేత్రావతిలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ శ్రీ చైతన్య 8వ బ్రాంచిలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు సోమవారం నాడు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. హాకీ, కబడ్డీ, క్రికెట్, కోకో తదితర ఆటలను ఆడాలని సూచించారు. అనంతరం 6 నుంచి 9వ తరగతి వరకు క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జులు దేవీకప, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.